# ఆద్యంతాలు

[కథానిక]

= శ్రీ ఏల్చూరి విజయరాఘవరావు =

౧

"పెదవికి మించిన పల్లు రాణించదులే...దేని కావిరగబాటు!"

మరదలు పిండి విసరుతోంటే, కసరుకొన్నది కాత్యాయని; తడివిడని మడిబట్ట చుట్టుకుని వీథి గుమ్మంలోనికి పల్చగా అడుగులు వేస్తూ వాలింది.

"ఉస్...కళ్లు తిరిగినా గడియారం తిరగదు! మధ్యాహ్నందాకా ఎవరు కాచుకుచస్తారబ్బా... అయినా మిట్టిపడుతున్నాడు మార్వాడీలాగా...ఇచ్చే ముప్పదిరూకలకూ రక్తం పిండుతాడీ రత్నదాసు!"

రెండు నిమిషాలు తేరిపార చూచింది. తమ్ముడు వస్తూన్నట్టు లేదు. ఓరవాకిలిగడియ బిగించి లోనికి వచ్చింది. "వేదా...అయిన పిండి చాల్లే... ప్రాణం మింటి కెగసిపోతోంది—పద. వాడు వచ్చేట్టు లేదు"

సన్నగా జవాబిచ్చింది వేదవతి: "అల్లాగే; మీరు కానియ్యండి: వారు వచ్చేదాకా నే నుంటాను"

మేకుకొట్టినట్లు వెనక్కు తిరిగింది కాత్యాయని. అనదలచిందేమిటో ఆమెకే బోధపడనట్లు గింజుకుందో రెప్పపాటు. చివరకు యిదీ జవాబు: "నీ యిష్టంలే".

ఈ మూడేళ్లనుండీ వేదవతి కొత్త వాతావరణంలో వుంటూన్నా, కొత్త అనిపించ దిప్పుడు మొదటిలోవలె. అత్తవారింట్లో ఎలా సంచరించడం అనేది చిన్నప్పటినుండీ వాళ్లమ్మ తనకు గరపివున్న నీతులలో ముఖ్యమైంది ... మనిషి చనిపోయినా మాటలు మనివున్నాయి. ఇప్పటికీ జ్ఞాపకమే వేదవతికి ...ఓనాడు గాజులు కొనమంది వాళ్లమ్మను. కొనిచ్చింది. రోజూ కొనియిచ్చే మల్లెపూలూ ఆనాడు కొనిచ్చింది...కొంటూ అన్న మాటలు తలచుకొంటే ఆరాత్రంతా అమ్మకోసం యేడ్చేది వేదవతి.

"దారిన పోయేదల్లా కొంటే రేపు నీమొగుడు దివాలాకి సిద్ధమౌతాడు. అసలు ఆడబిడ్డ పడనిస్తుందా! అడుగులకు మడుగులొత్తుతూ ఆమెకోరికలు తీర్చుకోవడంతోనే కాలం వెళ్లబుచ్చుకోవాలి ... తెలిసిందా?"

ఇక్కడికి రాకముందెప్పుడూ వేదవతి తల్లి అన్న మాటల్లోని గూఢార్థం గ్రహించుకోలేదు. భర్తనూ, పతిబంధువర్గాన్నీ సేవించడం తాను చదివిన పూర్వగ్రంథాల్లో సహజంగా వుంటూవచ్చింది. ఆసేవే తన ఆడు బిడ్డయెడల అంత తీవ్రరూపాన్ని ధరిస్తుందని ఆమె అనుకొని వుండదు...యిప్పుడాజీవితానికే అలవాటుపడిందామె! వివాహవిషయంలో ఆమె తలిదండ్రులు అనిలుని చదువు చూచారుకాని బీదతనం కాదు. ఇప్పటికీ, పండుగకూ పబ్బానికీ—గడవదన్న వుద్దేశ్యంతో కాకపోయినా — అల్లుడినీ, కూతుర్నీ యింటికి పిలవడం కద్దు. గృహకల్లోలాలు వినావున్నంతలో కాళ్లు ముడుచుకోవడం వేదవతికీ అట్టే కష్టం అనిపించలేదు. మరీ మొన్నమొన్నటి ఆడ బిడ్డ చేష్టలు చూస్తే పెంకుతో తలగోకినట్లు బాధగా వుంది. అనిలుడు నోరు విప్పి ఏదీ అనడు; అన్నా గుర్తించేవారు లేనట్లుంది...

•

వెండితీగల్లా మిలమిల్లాడుతూన్నది మధ్యాహ్నపు ఎండ. ఓరగా కప్పిన వల్లెవాటుజరీ తళుక్కున మెరిసింది ఊర్మిల వస్తూంటే...

రత్నదాసుగారి గారాబుబిడ్డ యీమె. అనిలుడు తన తండ్రివద్ద గుమాస్తాగిరీ చేస్తూన్నప్పటినుండీ ఈ రెండు కుటుంబాలూ పాలూనీళ్లల్లే కలిసినాయి.

పిండీపిండని గుమ్మపాలు తగని రుచి; తెలిసీ తెలియని ఆమె ఆలోచనలూ అంతే వేదవతికి. చిన్నతనపు చపలత్వం అకాలంగా యిప్పుడు తొంగి చూస్తుం దామెలో. తన పంచప్రాణాలూ వేదవతే అనుకుని సంతోషించగల్గడం వేదవతిలోని ఆకర్షణో, ఊర్మిల సుహృద్భావమో తెలియదు. వేదవతికి తల్లి మరణించింది—ఊర్మిలకు తల్లే లేదంటుంది లోకం. రత్నదాసు పెంచుకున్నాడని ప్రతీతి. పనిమనిషి పాలైనా రాచరక్తా న్నిచ్చినాయి ఊర్మిలకు... కానీ — ఊర్మిలారత్నదాసుల సంబంధం రక్తస్పర్శను మించింది.

"నాన్నా ... పాపం...ఇక పంపించేద్దూ—లెక్కలు తర్వాత చూచుకోవచ్చులే...వేద కాచుకుంటుంది"

ఆనాటి వజ్రాల లెక్కలు వ్రాస్తూన్న అనిలునికి లోలోన నవ్వు వచ్చేది. రత్నదాసు చూచీచూడనట్టు కలం అందుకుని వెనుక వుంచి అనేవాడు : "బాబూ! మరి వెళ్లిరా"

—ఊర్మిలకు రోజూ కొక్కసారయినా వేదవతిని చూచిపోవడం పరిపాటి. అంటున్నది ఆనాడు: "అక్కా...భోంచేశావూ?"

"మీ బావ రాలే దింకా...నీవూ?"

"ఒక నిద్రకూడా పోయాను—రోజూ ఇలా అయితే..."

"ఏమి సూకిరాలబ్బా...పుడుతూనే మాటలు నేర్చా రీకాలపు పిల్లలు! మొగుడు వచ్చేదాకా ఆగడమూ అబ్బురమేనా?"

తమలపాకుల తొడిమలువిరుస్తూ వెగటుగా నవ్వింది కాత్యాయని. త నెన్ని అనుకున్నా పరాయివాళ్లకే మధికారం తన తమ్ముణ్ణి అనడానికి? మాటవస్తే, బ్రహ్మప్రళయమైనా తన పట్టును విడనొట్టలేదు. అందుకదూ— తనకూ, తనభర్తకూ కాకుండాపోయింది! అతడు తీర్థయాత్రలకు పోయినా తన హృదయం చింతించదు. కానివాళ్లు లేనివాళ్లతో సమానం...... అని రక్తస్పర్శ సహించగలదా! తన తమ్ముడికి అన్నివిధాలా పనికివస్తున్నానని ఆమెకు మహాతృప్తి. ఒకసారి అతనికి జ్వరం వచ్చింది. పూటపూటకూ పట్టిన పట్టు విడువకుండా మారాంవేసింది. తీవ్రమైన వుష్ణంలో వుడికిపోయినాడు. మంచంప్రక్కగా వేదవతి కళ్లనీళ్లు పెట్టుకుంటున్నది. దిండు నొత్తిగిలి తల నిమురుతూ తను కూర్చునుంది. అన్నాడు మత్తుగా అనిలుడు:

"అక్కా! నే పోతే నీకు బాధకదూ?"

అబ్బ! అప్పుడు తన కెంత కష్టం వేసింది...ఈ వేదవతులందరికీ గ్రుడ్లకు నీళ్లుకుక్కడం తప్ప మరేమీ తెలియదు. జ్వరం విడిచిన తర్వాతకూడా తను పడిన ఆదుర్దా చెబితే తీరుతుందా!—

తరాలనాటి గొప్పతనాన్ని ఆకళింపుకు తెచ్చుకుని నిండుగా వుంది మనస్సు. ఆలోచనల్లో పగటి నిద్ర రాబోతోంది కాత్యాయనికి. బూరుగదిండు దూరంగా త్రోసిపుచ్చి చాప లాక్కున్నది...గోడకు తగిలించిన చైతన్యుని చిత్రం చూస్తూ ప్రక్క కొత్తిగిలింది.

"వైరాగ్యమేవ శరణం మమ..."

శ్లోకం ముగిసేలోపల కాళ్లచప్పుడు వినిపించింది.

దాటీదాటని యౌవనానికి తన వుద్యోగపు ఠీవి నల్లమెరుగు కప్పినా కళ తగ్గలేదు. నలుపురంగుకూడా పోగొట్టుకొన్న గొడుగును ముడిచి మేకుకి తగిలించాడు. దాని కాలం రాకపోవడమో, తనకు కాలం చిక్కకపోవడమో...క్రొత్తగొడుగు కొన వీలుపడింది కాదు. తీరిక దొరకినప్పుడు చుట్టిపెట్టిన తలపాగా వెదురుబుట్టలా అల్లుకుని బిగిసివుంది. అనిలుని కదిపి విప్పికట్టడం అనవసరం అనిపించియుండవచ్చు. వేల సంఖ్యకు మించిన రూపాయీల సంచీ రోజూ తన యింటిదాకా వెంటవస్తుంది; కాని ... యింటిలోనికి కాదు! తిరిగి రత్నదాసుబొక్కసంలోనికే చేరాలి.

ముడివేసిన సంచీ బీరువాలో దాచుతూ పిలిచాడు.

"వేదా!"

"వినబడదూ పిలుస్తూంటే?"

వేదవతి వస్తూన్నా, కాత్యాయని ఆమాటలు అనేసి తన వాలాయతి తీర్చుకుంది. కాళ్లు కడుక్కుంటూ అన్నాడు అనిలుడు భార్యతో: "యిస్సూ.. చెడ్డకష్టం. . దీనికన్నా మరేపనయినా నయంస్మీ"

అవ్యక్తంగా అనిలు డనిన మాటలలోని బాధ వేదవతిని కదిలించింది. సంభావణ మార్చినట్లు మృదువుగా అన్నది:

"ఇవ్వాళ అక్కగారికి ఏకాదశి"

వినిపించుకోనట్లు అన్నంముందుకు అడుగులు వేశాడు అనిలుడు. ఇన్నిదినాలుగా అతని కొక్కటే ఆలోచన. అదే తన అశాంతికి కారణమై యుండవచ్చు. "పిచ్చిలోకం . . వజ్రాయుధాన్ని ముల్లు తీయను వుపయోగిస్తుందే!" మనస్తత్వానికి వాతావరణం రూపం యిస్తుందంటారు; స్వగృహంలో దైవంగా చూస్తారు తన్ను. రత్నదాసుకూ తనంటే గౌరవం. మరి తనకు దేనికీబాధ! ఈ చిన్నపాటివుద్యోగానికి తను గడపిన జీవితమంతా చదువుక్రింద వృథా చెయ్యకపోతే బావుండేదనేమో!... ఒకనాడు అతను గాఢనిద్ర పోయినాడు. తిరిగి మేల్కొనేప్పటికి తన గడచిన దినాలు జ్ఞప్తికే రాలేదు. మంచినీ రివ్వవచ్చిన వేదవతిని గుర్తుపట్టలేక తానే నవ్వుకున్నాడు. ఏమిటీపిచ్చిభ్రమ!

పళ్లెంలో గీతలు గీస్తూ, వేదవతికి దగ్గరగా పీట లాక్కున్నాడు.

"నీవు భోంచేశావూ ?"

"ఇదుగో చేస్తాను"

"యిందాకా నాకోసం కూర్చోవద్దని చెప్పలేదూ?"

"ఆఁ...వాళ్ల ఊర్మిల వచ్చి మాట్లాడుతోంటే అల్లాగే పోయింది ప్రొద్దు."

"అయినా, మార్వాడీలాగా వదలకుండా వచ్చాడేం...అధికారం చలాయిస్తున్నాడు; రాచబిడ్డలతో స్నేహం చేసి యిదీ చెడిపోతోంది మరీ—" పడుకొన్న పళంగా లేచి కూర్చుని అన్నది కాత్యాయని. తమ్ముని జవాబుకు ఓక్షణం ఎదురుచూచిన మాట నిజం. నిండుకుండలా తొణకలేదు అనిలుడు.

౨

దృక్పథాలు మారుతాయి. నీ విషమే నాపాయసం!—నీలో నీకే మార్పు రావచ్చొకప్పుడు ...ఒకసారి కాకిని కాకిగా గుర్తించుకోగలవు. మరోసారి అదే కాకిని కోకిలగా భ్రమిస్తావు...

దీపాలవేళ. ప్రమిదలు తుడుస్తోంది వేదవతి. పమిటకొంగు పరచుకుకూచుని భగవద్గీతలు చదువుతోంది కాత్యాయని.

"శ్రీభగవానువాచా...

వేదా! దీపం పెట్టడానికే దినమంతా సరిపుచ్చుతావు- అలసివస్తా డని తెలీదూ? పొయ్యి రాజెయ్యాలి. కానివ్వు త్వరగా...నైనం ఛిందంతి శస్త్రాణి..."

జీవించడానికి తింటారో, తినడానికి జీవిస్తారో అన్న అనుమానం వేదవతి కెన్నోసార్లు కలిగింది. ఆడబిడ్డ పూచీకత్తు పుచ్చుకుని ప్రపంచం నడుపుతే, వెండికొండలన్నీ తిండికొండ లవుతాయల్లే వుంది! అలసివచ్చిన భర్తను తిండితో తప్ప సంతృప్తిపరచలేరని కాత్యాయనిసిద్ధాంతం కాబోలు! సమాధాన మిద్దామనుకోకుండా అనేసింది:

"మరేమీ ఫర్వాలేదు. కాఫీ త్రాగి వెళ్లారు."

ఈ జవాబులోని వెటకారం వేదవతి భర్తయెడల వూహించింది కాదు. గోరంతలు కొండంతలుగా చేసి కయ్యాలకు కాలుజాపడం కాత్యాయని దినచర్యలా కనిపిస్తోం దీ మధ్య వేదవతికి. ఎన్నాళ్లనీ ఈమౌనవ్రతం? తమ్ముణ్ణి వెనకవేసుకుని కాత్యాయనికి తనపై అధికారం చలాయించడాని కెంతో హక్కుంది నిజానికి. అయినా, మానప్రాణాలూ అర్పించుకున్న తన భర్తను చూచుకుని ఆమెకు జవా బివ్వడానికి పిసపాలైనా తనకు హక్కు వుండిఉంటుందని వేదవతి అభిప్రాయం. ఒకటి మాత్రం తనకు నచ్చింది; ఆమె యెంత తాపత్రయపడినా తన భర్తకొరకే అన్నట్లు

వ్యక్తమౌతోంది దూరాలోచనకు...మరి తన జీవితాశా అదేకదా, తనతో దేనికి ఏకీభవించకూడదూ?...పట్టు పట్టి నిలుస్తే, తన ప్రతి నడకకూ వెగటైన అర్థం ఖండితంగా చూపగల నన్నట్లు కొయ్యబారిన మనిషి ముందు వేదవతికి కాలుకదలడం లేదింట్లో. ఒదినా మరదళ్లకు పట్టదని పక్కయింట్లో వెక్కిరిస్తే, లోకంనోరు మూయతగినంత మూకుడు దొరక్కపోయింది కాత్యాయనికి. అదే అన్యజాతుల్లో జరిగితే, నీతిలేని నీచులని మూతివిరుస్తారు!—గుట్టుగా వుంటేనే కాపురం...

ఆరాత్రి అనిలుని ప్రవర్తన కొక కొత్తఅందం వచ్చింది. రోజుకన్నా సుఖంగా వున్నట్లు తెలుపుతున్నది వాలకం. వేదవతి కాశ్చర్యం వేసింది. ముడిచిన మల్లెదండ జడలోనికి ఒత్తి అలంకరించుకుంది. జాలుగా సాగివస్తూన్న కూనరాగాలు గొంతులోనే దిగిపోతున్నాయి ... అలా పట్టెమంచంప్రక్కగా మడత కుర్చీలో కూచుని, తీరిగ్గా సుమతిశతకం వల్లెవేస్తూన్న అనిలుని చూడక చాలాదినాలైంది వేదవతి. ఎంతో మోజుతో చిన్నప్పుడవి కంఠస్థం చేసేవాడట! పసి పాపను మరపిస్తూన్న అమాయికహృదయం ... అంతు చిక్కని ఆలోచనలకు ఆధారం పొడకట్టితేచాలు అదే పెన్నిధిగా తలుస్తాడు. తనలో మార్పు తన కాశ్చర్యం కలిగించదేమో!

"వేదా!"

"ఊఁ"

"నిజంగా మనం సుఖిస్తున్నాంసుమీ"

మరచిపోయిన సత్యాన్ని జ్ఞాపకంతెచ్చుకున్నట్లు యీవిషయం కదిలించడం వేదవతికి నచ్చలేదు.

"ఎవరు కాదన్నారేం?"

"అక్కయ్య—కాదు... నేనే. ఊరికే అంటున్నాను"

"ఏం జరిగింది మళ్లీ?"

"నే నీవుద్యోగం చేస్తాను."

"ఇంతకుముందు మానేశారా?"

"కాదు. ఇక మానివెయ్యను"

"వెనక అలా అనుకున్నారా?"

"ఊఁ...నాఅంత చదువుకున్నవాడికి గుమాస్తా పని ఏమిటీ? ... అని. తీరా ఆలోచిస్తే ఎంత వెర్రి వూహో చూశావూ ... ప్రతివాడికీ కలెక్టరుద్యోగం కావాలి. కష్టం చేసి బ్రతికే కూలీ అవుతానని అనుకోడుకదా!"

"ఎప్పటినుంచీ యీవేదాంతం?"

"కాదు. విను. ఏపని చేసినా బ్రతకడానికే. యిదీ అందుకే."

కర్మాగారాల్లో రక్కసిలాగా యినుపముళ్ల చక్రం గిర్రున తిరుగుతుంది. వేలసార్లు తిరిగినా ఒకే సుడిచుట్టూ! పట్టాలు తప్పని రైలుబండీ అంతే; తప్పితేనే ప్రమాదం. అది జరగనంతవరకూ సుదూరం నడవచ్చు. గమ్యస్థానం చేరగలమన్న ఆశా వుంచుకోవచ్చు...ఒడిదుడుకులు లేని జీవితాన్ని అనిలుడిప్పుడు కోరుకొంటున్నాడు. ఇంతవరకూ తనను అంటిపట్టి వున్న ఆకాశమెత్తు ఆశయాలన్నీ మిథ్యలని తేల్చివేశాడు.

"వేదా...అక్కయ్య ఏం చేస్తున్నదీ?"

"ఏం—అవసరమా?"

"పిలు చెప్తాను"

ఆరుబయట పరుపు పరుచుకొంది. ప్రక్కయింట్లో బాతాఖానీ కొడుతోంది కాత్యాయని. రోజూ యిదోఅలవాటీవొంటరికత్తెలకు; ఇంటింటి ముచ్చటా వీరికే కావాలి!...

"వొదినగారూ..."

వేదవతిగొంతు వినబడగానే చెబుతూన్నమాటలు టక్కున ఆపింది కాత్యాయని. "నువ్వేనా... రామ్మా రా ... ఆఁ ... మావేదం లెండి. మరెవరో అనుకున్నాను—" సంబాళించుకుని మళ్లీ చెప్పడం మొదలెట్టింది: "నాకూ యిష్టం కాకకాదు. స్వంత కాపురంలో నిప్పు పోసుకునేవాళ్లుంటారూ ఎవరేనా? మరీ ... కళ్లారా చూస్తూ ఎలా సహించను చెప్పండి! ఓనాడు కొత్త లాల్చీ తొడుక్కు, అర్ధరాత్రివేళ యింటికి వచ్చారు. డబ్బున్నది, దానికేం! రాళ్లవుంగరం తొడిగించింది...పిచ్చితెలివి, తీసిఅన్నా రాకూడదూ! అంతేకాదు! దగ్గరకు పోదునుగదా,

కమ్మటి గంధంవాసన వేసింది. చెబితే నాగోడు నమ్మరుగానండి, ఎన్నోసార్లు రాత్రిళ్లు గంధం తీసి పెట్టేదాన్ని ... నాకళ్లనీళ్లు తుడవనైనా రాసుకో లేదు—"

"ఒదినా, మీ తమ్ముడు రమ్మంటున్నారు" —మధ్యలో అన్నది వేదవతి. పాడిందే పాటగా, యే యింట చూచినా తన భర్త వెళ్లిపోయినందుకు తన ప్రారబ్ధం వెళ్లబుచ్చుకునే ముచ్చట వేదవతికి నచ్చ లేదు. తను వెళ్లగొట్టింది అతనే పక్షిలాగా యెగిరిపో యాడా? అంతా అనవసరప్రసంగం...

"చేసిన పాపం చెబితే తీరుతుందమ్మా—పద వస్తున్నా"

వేదవతివెనకాతలే కాత్యాయని వచ్చింది.

"నాయనా! పిలిచావూ?"

"ఆఁ...పూర్తయిందా నీపని?"

"పనీ బండలూ! ... ఆవిడ వూరికే పిలుస్తే వెళ్లాను"

వెల్లువలాగా వస్తూన్న నవ్వును ఆపుకోవడా నికి దోమతెరచాటుకు పోయింది వేదవతి. రోషంతో అన్నది కాత్యాయని: "నవ్వండి. నాజీవితమే నవ్వుల పాలయింది"

"సరేకాని—ధనపాల్ వుత్తరం వ్రాశాడు"

సంభాషణ మార్చిన అనిలునికి ఆడవాళ్లిద్దరూ దగ్గరసా జరిగారు.

"రోజు కొత్త సంబంధం పెకలివస్తున్నది! ఈధనపాల్ ఎవరూ...రావడం దేనికి?"

"నేనూ అల్లాగే అనుకున్నాను. జ్ఞప్తికి వచ్చే ప్పటికి తాతలు దిగివచ్చారు. మనలాగే వాడూ ఒక నిర్భాగ్యుడు. పదేళ్లనాడు నాకూ వాడికీ విడని స్నే హం. అప్పటికి నాకంటే ఎనిమిదేళ్లు పెద్దవాడు. స్కూల్లో బాదరాయణసంబంధంలాగే కలిశాం మే మిద్దరమూను...అక్కయ్యా ... నిజానికి చేతులుకలి పింది నేనే అయినా నన్ను మించిన స్నేహితులు వాళ్లిద్దరూ! బావ వుంటే వాణ్ణి నెత్తిన పెట్టుకునే వాడు!"

"అయితే యిక్కడికి దేనికి" — విసురుగా కాత్యాయని అన్నది.

"అసలు రావడం ఎల్లాగో నాకూ తెలియదు. చచ్చినవాళ్లు బ్రతికివచ్చే కాలం యింకా రాలేదను కుంటా—"

"అంటే!—"

"విను పూర్తిగా. మధ్యలోనే చదువుకు వుద్వా సం చెప్పాడు. మొదటినుంచీ విచ్చలవిడిగా తిరగడం అలవాటుచేసుకున్నా డసలు. దూరపు బంధువులెవరో తిండి పెడుతూవుండేవాళ్లుకాబోలు! అంతా అయిదా రేళ్లనాడు, పాపం! ఎక్కడో చెరువులో యీతలు కొడుతూంటే అమాంతంగా మునిగిపోయినా డని ఎవరో చెబితే విన్నాను...గిట్టని వెధవ లెవరో అలా పుట్టించి వుండవచ్చు...సన్యాసిలాగా తిండికి జరగక వూరూరూ తిరుగుతున్నాననీ, రెండురోజులు మన యింట్లోనూ వుండిపోతాననీ వ్రాశాడు పాపం!"

"పోనీ...రానివ్వండి"—వేదవతి జాలిగా అన్న మాటలు వినీవినకుండా బయటికి దూకేసి ప్రక్కమీద వాలింది కాత్యాయని. పడకగది తలుపువేయను వచ్చి తొంగిచూచింది వేదవతి...

"వచ్చే నాలుగురూకల్లో తనకు వండిపడేస్తున్నది చాలక తద్దినాలుగూడా తెచ్చిపెడుతుందట..అబ్బబ్బ!"

ఆడబిడ్డ గొణగడం చూచి నొచ్చుకుంది ప్రాణం. లోపలికి వచ్చి దిండు సర్దుతూ అంది: "నేను కొన్నాళ్లు పుట్టింటో వుండివస్తాను లెండి...నాన్న గారికి చెప్పంపండి"...

"వారున్నారు తల్లీ!"

మూడునాలుగురోజులు పోయాక ఓ మధ్యపాడు వయస్సు సన్యాసి అనిలుడు యింట్లో లేనప్పుడు వచ్చి అడిగాడు. కాత్యాయని తీక్ష్ణంగా చూచిం దతన్ని. ఎక్కడా చూచినట్లు జ్ఞాపకం లేదుగదా! మళ్లీ చూచింది. కాదు. ఈ గడ్డమూ అదీ ఎప్పుడూ చూడ లేదు. అతన్నిగురించి విన్నట్లు జ్ఞాపకం.

"మీ పేరు?"

"ధనపాల్"

ఇంతలో వేదవతి వచ్చి సత్కరించిం దతన్ని. అనిలుడు వచ్చేదాకా తను తెచ్చిన పుస్తక మేదో తిరగవేస్తూ కాలం వెళ్లబుచ్చాడు. రాగానే అనిలునికీ ఆశ్చర్యం వేసింది. తాను పూర్వం గొట్టికాయలాడిన ధనపాల్ యితడేనా! ఎంత మార్పు! బండ్లు ఓడలూ, ఓడలు బండ్లూ అవుతాయి నిజమే...

"గుర్తే పట్టలేకపోయాను మిమ్మల్ని"

"ఇంకా 'మీరు' అంటున్నావా! అంత దూరంగా వుంచకు స్నేహితుణ్ణి"

"చనిపోయా వని విని చాలా విచారించా నోయ్"

"నీకూ తెలిసిందేవిటి! కుశంకలు; నన్ను గేలిచేయడాని కలా పుట్టించారు. పట్టించుకోకపోతే సరి..."

ధనపాల్ వచ్చింది కొన్నిదినాలు పూరికే వుండిపోవడానికి. పూజాపురస్కారాలూ, వేదాంత పఠనం నిత్యకృత్యాలు కాకపోయినా వేళకు ఆహారం తోచనప్పుడు చుక్కల్ని లెక్కపెట్టడం ఇతను చేసింది. మిగతా వ్యక్తులకూ అతని కివన్నీ సమకూర్చడం వినా మరేమీ పట్టలేదు; ఓ బడుగు సన్యాసివిషయం ఎవరికి కావాలి!

................

మొదటి మూడురోజులూ జరిపిన మర్యాద యిప్పుడు లేదు....అతని కీమూకీభావం అర్థమైందో లేదో...

3

దీపాలు పెడుతూన్నప్పుడు రత్నదాసుగారి యింటినుంచి అప్పటికి లెక్కించని డబ్బు పట్టించుకు తిరిగి రావడం అనిలుని దినచర్యలో చివరిభాగం. మరునాటి వుదయం అనిలుని వెనువెంటనే తిరిగివెళ్లుతుం దాడబ్బు. తరువాత యెన్నిచేతులు మారినా కొత్త నాణెములను కలుపుకుని ఎప్పటిచోటికి చేరాలిసిందే. అది రత్నదాసులాఘువమైనా కావచ్చు; సిరివలపైనా కావచ్చు! కలమ్మ వున్నమ్మకే పెడుతుంది; లేనమ్మ వున్నమ్మకే పెడుతుంది...అది కాలపు ధర్మమేమో!

రాత్రి కొత్తస్నేహితునితో సల్లాపాలాడడం తోనే సరిపోయింది. డబ్బు లెక్కపెట్టనూ తీరిక దొరకలేదు. పనిమాత్రం కాళ్లు చాచుకుని కూర్చుంది —నాసంగ తేమిటన్నట్లు. కొత్తగా వచ్చిన వజ్రాలు తెచ్చివుంచాడు. వాటి విలువలు తేల్చాలి. దాసుగారి పనిమనిషి సాయంకాలం తెస్తానన్న గదితాళం యింత దాకా రాలేదు. ఇప్పుడు తెచ్చినా యేమయ్యేట్టు? యీబుద్ధితక్కువ మనుష్యులతో పని పాడవుతోంది మరీను......

బడలికగా నిద్రపోయినాడు ఆనాటికి.

కలలు మిథ్యలంటారు. అంతరాత్మలోతులు అందని అల్పులకు అది నిజంగా తోచవచ్చు. ముందు చూ పున్న ఇంగితజ్ఞునికి తన బ్రతుకన్నా కలలే సత్యంగా కనిపిస్తాయి..

ప్రొద్దు పొడిచినా మెలకువ రాలే దనిలునికి. దుడుకుగా కాత్యాయని నిద్రలేపి వెళ్లింది. వేదవతిని పిలిచి "యివ్వాళ పీడకలే వచ్చిం"దన్నాడు. అలా జ్ఞాపకమున్న ప్రతికలా ఒకరికొకరు చెప్పుకోవడం కద్దు. అందుకు, తేలికగా నవ్వి అన్నాడు ధనపాల్: "కలలు నిజమైతే నే నీపాటికి రత్నదాసులా వజ్రాల వర్తకం చేయకపోయానా? యీ కాషాయాంబరా లేమిటీ?" అని.

"పిచ్చిముచ్చట్లు కట్టేసి పని చూచుకో"—పడమటింట్లో పాత్రలు సర్దుతూ కాత్యాయని చెప్పింది.

కాలకృత్యాలు కానిచ్చి వెళ్లబోతూ అడిగాడు అనిలుడు:

"పనిమనిషి తాళం తెచ్చిందా?"

"అయ్యో-దొంగముండ తేలే దింకా - అక్కడకు పోయి తీసుకో...ఆఫీసుతాళం పనిమనిషి కివ్వడమేం?"—కాత్యాయని జవాబుచెప్పింది.

బీర్వాలో సంచీలు తీస్తూ వేదవతివైపు తిరిగి అన్నాడు అనిలుడు: "హు! రాత్రి మరిచేపోయాను... వీటిని లోపల వుంచను"

వెళ్లగానే ఊర్మిల ఎదురువచ్చిం దివ్వాళ.

"ఆలస్యంగా వచ్చారేం? అక్కయ్య వదల లేదా!"

"నీకూ, మీ అక్కయ్యకూ మరి పనిలేదు..."

"తమరంతా ప్రపంచసృష్టికర్తలాయిరి!"

"మాయింటి కొక చుట్టం వచ్చాడు. అతనితో మాట్లాడడంతో నాపని వెనుకబడిపోతోంది..."

"మరోమాట — ఏమి టాసన్యాసిరాయడి ప్రవర్తన! నా కట్టే బాగా లేదు. కనబడ్డ ఆడపురుగు నల్లా చూడడంతప్ప గతిలేదూ...కాత్యాయనీ, నేనూ మొన్న కబుర్లు చెప్పుకొంటున్నాం. గదిలో కూచ్చుని ఒకేచూపు మావైపు!...మధ్యమధ్య—మరీ దొంగ నటనకు అంతుండద్దూ...తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు తల గిర్రున ఆడించుకోవడం...నా కెందు కను కున్నానుగాని ముఖాముఖి అడిగేసివుందును—"

"అది కాదు—విను. నోటికి కరువైనా మాట వరుస కలాంటివాడు కా డతను. చూచినంతమాత్రాన మీ వజ్రాల మూటంతా ఏంపోయిందేం. అయినా..."

"బావుంది మీ మగాళ్ల ముచ్చట!"

"పని ముగిసిన తర్వాత యింకా బావుంటుంది ...ఊర్మిలా! ఆనక రా పో"—నవ్వుతూ కచేరీగది లోకి వచ్చి ఊర్మిలను పంపించివేశాడు రత్నదాను.

"బాబూ...రిచ్‌హోక్ పడవమా టేమిటో?"

"రసీదు వచ్చింది—కానీ..."

"అవును. విన్నాను. కట్టిన డబ్బు మునిగి పోయిందట. మరీ కలిసిరావడం లే దీమధ్య."

ఓపదినిమిషాలు నిశ్శబ్దంగా గడిచింది. ఆనిశ్శ బ్దాన్ని చీలుస్తూ అనిలు డన్నాడు:

"నాలుగోబిల్లువజ్రాలు అందుకొన్నాం"

"విలువ చూచావా?"

"చూస్తాను"—జాగ్రత్తగా బిగించిన రెండు సంచీలనూ తోలుపెట్టెలోంచి బయటికి తీశాడు. నిద్ర చాలక కాబోలు, ఎడమకన్ను అదురుతోంది!

"రాత్రి పనిమనిషి తాళం తేలేదు. లెక్క తేలకపోయిం దందుకే"

"యిప్పుడు తేలదుటోయ్!"

పదిలంగా కరెన్సీ లెక్కపెట్టివుంచాడు. ఉంగ రాలవ్రేళ్లు చలాకీగా కదిలిస్తూ అందుకున్నాడు రత్నదాను.

"సెభాష్...ఆరున్నొక్క వెయ్యికదూ..."

'ఊ'—వజ్రాల సంచీ మూతివిప్పుతూ జవాబు చెప్పా డనిలుడు ... "ఒకటి...రెండు ... మూడు, తొమ్మిది—అరె!!!"

గుండె పగిలిం దతనికి. కనుబొమలు ముడివడి నాయి. నుదురు వికృతంగా విశాలమైంది. గ్రుడ్లు మసకలుకమ్మినాయి. డబ్బు లెక్కిస్తూన్న రత్నదాను అదిరిపడ్డాడు...

"ఏమిటోయ్?"

"తొ...మ్మి...దే...వున్నాయి"

"ఆ!! మిగిలిన రెండూ..."

"అవును...పో...యినా...యి"

పనిమనిషితో మాట్లాడుతూ గదిముందుగా వెళ్తూన్న ఊర్మిల చెవులో ఖంగుమన్నా యీమాట లు..."ఇది మంచికి కాదు బాబూ ... నీమీద నాకు అనుమానం వుండికాదు—నిజం చెప్పు"

ఏమి టీ సంభాషణలు!!! శిలాప్రతిమలా నిశ్చే ష్టుడైన అనిలుని చూచిచూచీ కరగిపోతూన్న ది ఊర్మిల.

"నాన్నా...ఏం జరిగింది?"

"అదే—పనిమనిషిని పిలు. ఫో"

"కూతురుకు చెడ్డ జ్వరంట పాపం...నిన్న తాళం యివ్వనందుకు బతిమాలుకుని యిప్పుడు యిచ్చి వెళ్లిపోయింది"

ఆశగా అనిలు డందా మనుకున్నాడు—"పని మనిషిని కనుక్కొంటే?" కానీ — తన అజాగ్రత్త కారణంగా పోయిన వజ్రాలకు ఒక బీదమనిషిని బోనుకెక్కించడం ఎంత భీరుత్వం! మరి తాళం నిన్న తెచ్చింది కాదేం... ఆ తీసిన వెధవలతో దీనికి పరీ కా... అయివుండదు. తన స్వంతమనుష్యులకు జబ్బుగా వుంటే తను వచ్చేవాడేనా పనికి? గోరంత తలనొప్పికి ఒక పక్షం సెలవు పుచ్చుకుతీరాలి! అయినా గదితాళ మది. వజ్రాలపెట్టికి మరోతాళం వుందిగా—అన్నట్టు అదీ వేయలేదు నిన్న ... ఛీ..తల్లిలేని ఊర్మిలకు తన

చనుబాలు పంచియిచ్చి, ఆయింటికి తన శ్రమ ధార పోస్తూన్న అది అలాంటి పని చేస్తుందా! ఏమో, కలి యుగం!

అనుమానమూ, ఆకాశమూ అంతూ పంతూ లేకుండా అంతటా వ్యాపించగలవు.

రత్నదాసు పెద్దమనిషి. ముందాలోచన లేకుండా తూలనాడడం అతని పద్ధతి కాదు. లోటు కనిపిస్తే పోనిచ్చే ఘటమూ కాదు. ఇన్నాళ్లగా, నమ్మకద్రోహి కాడని తన సర్వస్వమూ అనిలునిచేత చక్రం తిప్పుతున్నాడు. వేలసంఖ్యను మించి విలువైన వజ్రాలు రెండూ ఒక్కసారిగా కనుపించనప్పుడు నిప్పులేకుండా మండిం దతని హృదయం.

"అడిగి తీసుకోలేకపోయారా వారెవరో ... ఛూ"

వంకరగా తన్నెత్తిపొడుస్తూన్న రత్నదాసు మాటలు పిడుగులైనాయి అనిలునికి. కన్నీరు బొటబొట రాలిపోతోంది. తనను కత్తితో పొడిచినా తనకు బాధ లేదు. తన హృదయాన్ని గోరుతో తాకినా కన్నీరై కరగిపోతాడు...ముఖం ప్రక్కకు తిప్పి జవాబు ఆలోచిస్తున్నాడు.

"చెప్పు...నీవై యుండవులే-నీవై యుండవులే - నీవు లేనప్పుడు మీవాళ్లెవరేనా—"

ఊర్మిల పనిమనిషిని పిలుచుకొచ్చింది.

"నీవేనా? చెప్పేతీరాలి"

హడలిపోతోంది పనిమనిషి.

"బాబూ...నన్ను నమ్మరూ!"

ఉగ్రుడై అన్నాడు రత్నదాసు: "అందరినీ నమ్మే రోజులుకదూ యివి...హు"

చివుక్కుమన్న దనిలుని మనస్సు. నిజమే... తనంతవాడీపనిలో స్థిరపడడం పొరపాటే. సముద్రపు కెరటాలలా పొంగివస్తున్నాయి పూర్వం మరుగు పడిన ఆలోచనలన్నీ.

"అనుభవించాలి...నేనుమాత్రం దేవతనా?"— లోలోపల అణిగిన వాముక్కలు. నాలిక కొసదాకా వచ్చింది. అననే అన్నాడు:

"బాబూ! క్షమించండి. నేనే దాచివుంచాను. యింట్లో వున్నాయి"

ఊర్మిల చెక్కబొమ్మలా నుంచుంది. ఏమంటున్నా డితను!!

ముఖం ముడుచుకు వెళ్లిపోతున్న అనిలుని చూచి అన్నాడు రత్నదాసు: "యీ రెండువజ్రాలతో నాభాగ్యం కాదు—నీమాట పోయింది?."

సూది మొనలపై కాలుపెట్టినట్లు ఇంటికి నడిచాడతను. అతని కిప్పుడు తన మనస్సుమీదే నమ్మకం పోయింది; భార్యా, బంధువులూ ఒక లెక్కా!

వేళగానివేళ గడపతొక్కడం చూచి వేదవతి అనుమానించింది. "ఇంత త్వరగా వచ్చారేం?"

పరాకుగా అన్నాడు: "అంతా క్షేమమేలే— కొన్నాళ్లు పుట్టినింట్లో వుండివస్తానన్నావు...వెళ్లిరా. ఆ రెండూ నీవే వుంచుకోలే"

"ఏరెండూ!"—గాభరాగా వేదవతి అడిగే లోపలే అనిలుడు మనస్సు నొచ్చుకున్నాడు. అయినా యేం? "అందరినీ నమ్మేరోజులుకదూ యివి?"

"చెప్పరూ...ఏం జరిగింది!"

"ఏమీ లేదు. అక్కయ్యను పిలు"

"ఇంతదాకా జగడాలు వేసుకుని నీళ్లకు వెళ్లింది"

"ఏం?"

"మీస్నేహితుడు పోతూపోతూ 'వారితో వెళ్లివస్తానని చెప్పండి' అన్నాడు. పాపం, వున్నన్నాళ్లూ చేసిన మర్యాద యెరుగుదురుగా—'అల్లాగే' అన్నాను వూరికేవుండక. 'ఛస్...యిన్నాళ్లూ వుండి, మాటా మంతీ లేకుండా వెళ్తాంటే, ఆసన్యాసి రాయణ్ణి వదలడమేనా! మగవాళ్లింటో లేనప్పుడు ఆముచ్చు ఏం చేతబట్టుకు పోయాడోకదా!' అని విరగబడా తిట్టింది..."

అనిలుని కెటూ పాలుపోలేదు. స్నేహితుడా, చెప్పకుండానే వెళ్లిపోయాడు. అక్కయ్య జాగ్రత్త గల మనిషే. అయినా ఏమో!—

"చెప్పరూ"—దీనంగా అడిగింది వేదవతి మళ్లీ.

"ఏమీ లేదు ... కోర్టుపనిమీద కొన్నాళ్లు వూరికి వెళ్లుతున్నాను. తిరిగి వచ్చేదాకా అక్కయ్య యిల్లు చూస్తుంటుంది. నిన్ను మీ నాన్న రమ్మన్నారు. వెళ్లు."

ఈ జవాబు వేదవతి నేమీ సంతృప్తిపరచ లేదు. "అంత కష్టమైతే వెళ్తాను లెండి" అన్నది.

అనిలుని కీమాటలు బాధను కలిగించినాయి.

వస్తూనే "ఏం బాబూ! ఇంత త్వరగా వచ్చావేం! మానాయిన అలిసిపోయినాడమ్మా; వేడినీళ్లు తేనా" అంది కాత్యాయని.

"అక్కా! అతను వెళ్లిపోయేప్పు డేం చెప్పాడు?"

"తెల్ల మొహం వేశాడు. అంత హడావిడిగా వెళ్లడానికి కారణం మాత్రం చెప్పద్దూ...మగవాళ్లు లేరని దులబరించుకు వెళ్లడమేనా ?"

"పోనీ. ఏమీ నష్టంలేదు... మరో పక్షంలో తిరిగివస్తాను. వ్యాపారంమీద వెళ్లడం. యిల్లు చూస్తుంటావు కదూ?"

"అయ్యో బాబూ... యీ ప్రయాసంతా నీ కోసం కాదుట్రా. నే పోయేప్పుడు దమ్మిడీలతో కూడా లెక్క చెప్పి మరీ చస్తాను. ఊ...ఏదిక్కేవిటి ?"

"ఇంకా తెలీదు."

"మరీ – సరే వెళ్లిరా"—వంటయింట్లోకి పోయింది కాత్యాయని. ఏదో చెబుదా మనుకుని వెనుదిరగబోయింది... "ఆ. పదిరోజుల్లో రాడూ. అప్పుడు చెప్పకూడదూ. అయినా మణిగిపోయే సంగతులేం లేవుగా..."

"వేదా, మరి వస్తాను. బండి పిలుచుకువచ్చి మాట్లాడనా?"

"ఊ."

వాకిలి దాటి వెళ్లాడు. వాకిలిని తిరిగీ చూడలేదు. వీథి దాటి వెళ్లాడు. వెనుదిరగలేదు. "అవును. కాకిని కోకిలగా భ్రమించాను. యీ వుద్యోగం నాకు వద్దు. ఈ ప్రపంచమే నాది కాదు." తనలో తానే అనుకున్నాడు చాలాసార్లు.

అరగంట గడచినా బండిలేదు. వేదవతి భయపడింది. వీథి గుమ్మంలోనికి పోయి తొంగిచూడను లేస్తోంది. పరుగు లెడుతూ ఊర్మిలగారి పనిమనిషి వచ్చింది.

"అమ్మా...అయ్యగా రేరి ?"

"ఏం?"

"వజ్రాలు దొరికినాయి."

వేదవతి పంచప్రాణాలూ గిలగిలలాడినాయి.

"ఏం వజ్రాలూ!!"

"పోయిన రెండూను. దాసుగా రివ్వాళ మళ్లీ సంచీ వెతుకుతే కనిపించినాయట... చెక్కు చెదర లేదట... ఊర్మిలమ్మగారు దొడ్డు తీయమన్నారు. ఏరీ పాపం! అయ్యగారికి కళ్లనీళ్ల దాకా వచ్చింది బాబును నిలేసి అడిగినందుకు...ఏరీ !"

"అమ్మా- నీకు పుణ్య ముంటుంది. ఆ బండ్ల రాస్తాదగ్గర చూచిరామ్మా" — వేదవతి ప్రతిమాలుతోంటే సిర్విణ్ణురాలై పరుగెత్తింది పనిమనిషి.

లోపలికి వచ్చి చుట్టలు చుట్టుకుని ఏడుస్తోంది వేదవతి. కాత్యాయని అంటుంది: "తల్లీ! దేవుడి పీట పడమటింట్లోకి మార్చాను. మైలగుడ్డలతో ఎప్పుడూ వెళ్లకేం..." లోలోపల కుమిలిపోతూన్న వేదవతి హృదయం ఆమె గ్రహించిందా !

ఆమె అంటుంది: "ఒదినగారూ, వా రెప్పుడు వస్తారు మళ్లీ?"

"వస్తారు...తొందరేం ?"

ఇదే సంఘటన మరో యింటిలో జరుగుతోంది. మణిహారం మాటిమాటికీ తళుక్కున మెరుస్తోంది ఊర్మిల చేతులో. యీదినం రెండువజ్రాలు కొరతపడినా యందులో...

పనిమనిషి వచ్చి జాలిగా అంది: "అమ్మా! వారు కనిపించలేదు. వెళ్లిపోయారు."

ఊర్మిల కొంగుతో కన్నీరు అద్దుకొంటూ అంది: "అబ్బా! మిగిలిపోయింది. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు."

విసురుగా మణిహారం మెళ్లోంచి లాగి బల్లమీద పడేసింది. అందులో రెండు వజ్రాలు తగ్గివున్నా యిప్పుడు!

## ౪

బ్రతుకు కర్పూరంలాంటిది. పీలు చిక్కితే వజ్రమై మెరుస్తుంది. వాలు తప్పితే బొగ్గులా కాంతి విహీనమై కాలితో తన్నబడుతుంది!

దారీ తెన్నూ కానలేని స్థితి వచ్చేప్పటికి, అతివృష్టికి వరదలు పారినట్లు పరిపరివిధాల పోతుంది మనస్సు. మనం చెప్పినట్లు అది నడుచుకోనప్పుడు సర్వస్వమూ విధికి స్వాధీనంచేసి-అదిచెప్పినట్లు మనం నడుచుకుతీరాలి.

ఇంటిముందు రాలిన నేరేడుపండ్లు మసకచీకటి రంగులో కలుస్తున్నా యిప్పుడిప్పుడు. ఏరుకోవడానికి చేరిన పిల్లగుంపు పన్నగిలింది. దూరంగా ముట్టించిన వీథిలాంతరు, రాహుకేతువులు నంజుకున్నట్లు, ముడుచుకుపోయి కొద్దిదూరమైనా కనిపించడంలేదు. రైలుకు దిగిన మనుష్యులు వడిగా నడిచిపోతోంటే వారికై వచ్చిన మనుష్యులు మారుపడుతున్నారు. వీరిని చూస్తూ,పిండిముగ్గులు చెరిగిన అరుగుమీద చాపపరుచుకుని ఆయన కూర్చునివున్నాడు. దూరంగా వస్తూన్న బండివేపే అతని దృక్కులు. ముఖ మంతకంతకు విప్పారుతున్నది. చుట్టిన చాపచుట్ట నౌకరు లోనికి తీసుకువెళ్లాడు. వెండిపొన్నులకర్ర పుచ్చుకుని బండి కెదురు నడిచా డతను.

"మాతల్లి వస్తోన్న ట్లుంది!"

దగ్గరకు రాగానే గ్రహించాడు, అందులో ఒక్కరే వున్నారని. కొంచెం బరువుగా తోచింది గుండెల్లో.

"బాబూ . . అమ్మాయి యేదీ?"

"అంతా క్షేమం. వస్తుందిలెండి"—తిరుగుతూ తిరుగుతూ ఆగిన బండిచక్రంచారలో దృష్టి సారిస్తూ దిగాడు అనిలుడు.

"వ్యాపారంపనిమీద వచ్చాను"

ఈమాటలు మామయ్యకు రుచించనట్లు స్పష్టం. "మిమ్మల్ని చూచిపోవడానికి వచ్చా"నంటే ఎంతో తృప్తిపొం దేవా డని తర్వాత అనుకున్నాడు.

"అంతా క్షేమమేకదా"

"ఆ"

సంవత్సరంనాడు అత్తవారింటికి వచ్చినప్పుడు మామయ్యను చూడాలన్న వుత్సాహంలో, వెండితీగలా వెలిగిం దొక నవ్వుజీరా. ఆపనే యీనాడు చేస్తోంటే కన్నీరే తక్కువ. మామయ్యకు జీవితాశ వేదవతీ అనిలులే. ఆబొమ్మలు ఆడుతోంటే చూస్తూ, యీ దీపం ఆరిపోవాలి.

ఎంతో వాత్సల్యంతో మాట్లాడాడు మామయ్య. తను వేదాన్ని తీసుకువస్తానని వ్రాస్తే, కష్టమౌతుందేమో నని యింటికి చేయించిన మరమ్మత్తు లొక్కొక్కటే అల్లుడికి చూపించాడు. ఇన్నాళ్లుగా చూడాలని తాను పడ్డ వ్యథంతా వెళ్లబోసుకున్నాడు.

"పాపం...దాన్ని నీవెంట తెచ్చి వదిత్తే పో యేదిగా"

"అవును"— మామయ్యమాటలు వింటూంటే కుమిలిపోయాడు లోలోపల అనిలుడు. తాను వెళ్లిపోతే—ఎక్కడికెక్కడికో వెళ్లిపోతే—యీ మామయ్యకూ తనకూ సంబంధం కలిపిన వేదాన్నిక చూడడు...మామయ్య బ్రతుకగలడా!—

ఇంతలో ప్రపంచం కప్పిన మసకరంగులు ఆవరించినా యతని కళ్లకు. తెరకట్టినట్లు ప్రతివస్తువూ సత్యానికి మరుగుపడిపోయింది...అన్నాడు : "ఏం! మామయ్య బ్రతుకలేడా యేం? మహరాజులా. శాశ్వతంగా కన్నబిడ్డలనూ, చేసుకొన్న భార్యలనూ పోగొట్టుకొన్నవా ళ్లెంతమంది లేరేం?... పెంచుకొంటారు; పెళ్లిచేసుకుంటారు. ఇది లోకం. హు..." తనలో దాగివున్న లోకపు వికృతచ్ఛాయ లీమాటలు అతనిచేత అనిపించివుంటా యప్పటికప్పుడు.

ఊరికే గడచిపోయినాయి నాలుగు దినాలు. తన గమ్యస్థానం అనిలుడు ఆలోచించుకునేలోపలే తనకు చిక్కు వచ్చేట్టుంది. వేద తండ్రికి చెప్పంపించింది, తా నీక్షణమే బయలుదేరి వస్తూన్నట్టు. అది మామయ్యకు సంతోషం. అనిలునికి సంతోషమూ, దుఃఖమూకూడా.

"మామయ్యా...నే రైలుకెళ్లి పిల్చుకొస్తాను"

"అల్లాగే బాబూ. జాగ్రత్తసుమీ."

వీథి చివరకు సాగిపోయేదాకా గుమ్మంలో చూస్తూ నిలబడ్డాడు మామయ్య. మలుపు తిరగగానే చటుక్కున యింట్లోకి పోయి నౌకరుతో అన్నాడు: "ఒరే...గదిలో వుయ్యాలబల్ల గొలుసులు తగిలించు మళ్లీ"

వచ్చే, పోయే బండ్లకు రెంటికీ వేళయింది. తిరిగీతిరిగీ స్టేషన్ చేరుకొన్నా డనిలుడు. రంకుల రాట్నంలా తిరుగుతోంది తల. జేబులో వున్నడబ్బంతా లెక్కించాడు. ఫర్వాలేదు.

దిగిపోయే ప్రయాణీకులను ఎక్కేవా ళ్లటకా యిస్తున్నారు ... అందులో వేదవతిని చూచేప్పటికి, వూహించుకోలేనంతగా బాధపడ్డ దతని హృదయం. కొన్న టిక్కెట్టు మరోడి కిచ్చేసి వెళ్దామని ముందుకు అడుగులు వేస్తాడు. మరికొంతదూరం సాగిపోతే తను వేదవతి కపడడం తథ్యం...

"ఛీ...మళ్లీ ఆరాంపిలోకే!"—

సైనికునిలా వెనుదిరిగి చివరిపెట్టిలో కూర్చు న్నాడు. వేద వెళ్లుతోంది....వేదవతి వెళ్లిపోయింది. తన్ను చూడకుండా వెళ్లిపోయింది. అనిలుడు పిలి చాడు: 'వేదా'...ఆ పిలుపు రైలుకూతలో కలిసి ప్రక్కవాడికీ వినిపించదు.

వేద యిల్లు చేరుకునేప్పటికి పండుగనాడులాగా అలికి ముగ్గులు పెట్టివుంది. అది అల్లుడూకూతుళ్ల రాక కని ఆమెకు తెలీదు. అత్తింటి ముచ్చట్లు ప్రాణాన్ని త్రుంగదీసినా, తన పుట్టింటిలో శుభసూచక మొక్క టైనా వినబోతానేమోనని కొంచెం స్తిమితపడింది... ఆయన వేదవతిని చూచాడు. ప్రాణం లేచివచ్చింది.

"నాతల్లి రావే...అత నేడీ!"

వేదవతి కర్థంకాలేదు. "ఎవరాయన?"

చిన్నపిల్లనులా ముద్దుపెట్టుకుందా మనిపించింది. తనతో నోరారా పరసాలాడుతోం దనుకున్నాడు ...

"ఎవరో కనుక్కో"

"చెప్పు నాన్నా...ప్రాణం తీయకు"

వేదవతి యిలాంటి జవా బిస్తుం దనుకోలే దాయన. ఇదేమిటి!

"నిన్ను పిలవబోయిన మీఆయన్ను నీవు పిలవ బోవాలా...అనిలుడేడీ?"

"ఆఁ!! ఇక్క డున్నారా?" గడపకు పెట్టిన పసుపుకుంకుమలు ఎముకలూ రక్తంగా కనిపించినాయి వేదవతికి. వ్యాపారంమీద వెళ్లుతానన్న తన భర్త ఆలోచన లేకుండా అత్తవారింటో వున్నాడు. తను వచ్చేప్పటికి మొహం తప్పించడమూ జరిగింది. ముందే అనుమానించింది 'తన మాంగల్యం తనకు దక్కుతుందో దక్కదో' అని...సమ్మెటపోటు తగిలినట్లు బాధగా అంది: "అబ్బా ... వారు వెళ్లిపోయారు. నాకు వేల మైళ్లదూరం పోతారు. పోతున్నారు. యిక తిరిగి రారు...నాన్నా!"

నిజంగానే అనిలుడు వెళ్లిపోతున్నాడు. అతని లో రేగిన యుద్ధం చల్లారే విధానం కనిపించడంలేదు. ఒక్క అనుమానంమాత్రం వుంది. త నెంతదూరం వెళ్లినా, త న్నంటిపట్టి ప్రపంచం రాగలదా! ఆ మురి కితో అవినాభావం వుంచుకోందీ మానవుడు బ్రతుకడా? దీని అంతం కనిపెట్టడానికి పూనుకోవాలని అతనికి వుంది. ఎంతవరకు విజయం పొందుతాడో తనే చెప్పు కోవాలి...

పంటపొలాల్లో పచ్చని పైర్లను చూస్తూ గాజు కిటికీకి ఒత్తిగిలాడు. వానిలోని అందం తను ఆస్వాదిం చడం లేదు. ప్రక్కపెట్టిలోంచి పొగతాగుతూన్న పెద్దమనిషి నీడలునీడలుగా వూదుతున్నాడు. ప్రక్క వాళ్ల సౌకర్యం తనకు పట్టదు...అనిలునికి కళ్లు తిరుగు తున్నాయి. ప్రొద్దున కొనుక్కుతిన్న మిఠాయి తెవులుకువస్తున్నది. కొమ్ముచెంబుతో కుర్రాడికి మంచినీళ్లు పడుతోం దొకావిడ... "తృష్ణ...నాకన కమే..."

పెదవి విరుస్తూ అత నన్నాడు: "ఎన్నాళ్లిలా?"

చపలచిత్తులు చుట్టీ చుట్టీ ముడివేసిన త్రాడు మళ్లీ వెనక్కు లాగినట్లు- ఎన్నోవూళ్లు దాటివెళ్లినా, కదలనట్లే వుంది బండి.

"అరే! ధనపాల్!"

తానున్న పెట్టిలోనికే అతనూ రావడం విచిత్రం వేసింది అనిలునికి. నెమ్మదిగా అడుగులు వేస్తూ వచ్చి

ప్రక్కన కూర్చున్నాడు. మైళ్లదూరం ప్రయాణం చేసినా, తనతోడు వచ్చేదా కాషాయాంబరమే...

"ఎందాకా?"

అనిలుని నోటిదాకా వచ్చింది: "వ్యాపారంపని మీద" అని...ఛీ...అని నోరు మెదల్చి అన్నాడు: "ఆఁ...యిందాకే...నీవూ?"

"ఈరైలు వెళ్లేదాకా — చెప్పకుండా వచ్చినందుకు నొచ్చుకున్నావా?"

"సుతరాం లేదు."

"అక్కగారెలా వుంది?"

"ఆమె కేం...క్షేమం"

"నీతో కొంచెం మాట్లాడాలి.......యిష్టపడతావా"

మళ్లీ ఏ అవాంతరం వచ్చిపడుతుందో అని అనిలుడు కంపించాడు. తల్లికడుపులోంచి పుట్టినప్పుడే తన కలా వ్రాసివుందికాబోలు......అడవిలో దాగినా ఆపదలు తప్పని జీవితాలు కొందరివి...తను పారిపోయినా అవి వదలవు...ఏమిటో...

"కానీయి"

అతను చెప్పడం మొదలెట్టాడు. "తగిలిన వేలికే తగలడం శుభసూచకం అనుకోవాలి. కష్టాలను ఆనందంతో ఆహ్వానించగలిగితే అంతరాత్మ అందివస్తుంది... చూచావూ...నేను మీకు గుర్తుండివుండను......ధనపాల్‌ను కాదు...మీబావను. కాత్యాయనిభర్తను..."

గగుర్పాటు చెందిం దనిలుని హృదయం. ప్రశ్నార్థకంగా వంగి నిలువునా చూచాడు తన బావను...ప్రీతిగా దగ్గరకు జరిగి అన్నాడు: "ఎన్నాళ్లకు కనిపించావూ...ధనపాల్ అన్నావేం?"

ఆప్యాయంగా అతను జవాబిస్తున్నాడు:

"నే వ్యభిచరించిన మాట నిజమే. నాతప్పు నే ఒప్పుకున్నాను. మానవమాత్రుడు తప్పు చేయడం సహజం...కించిత్తు హృదయం చూపించకపోయింది మీ అక్క!—ధనపాల్‌ను ఆశ్రయించాను. సమానునిగా ఆహ్వానించాడు నన్ను....అదీ నాదురదృష్టమే అయింది...పెద్దయినా వాని బుద్ధి మారింది కాదు. ఓ రోజు, నదిలో స్నానం చెయ్యను వెళ్లి తిరిగే రాలేదు. నావిధి అక్కడా నిరాకరించింది నన్ను......నిన్నటి స్నేహితునికూడా గుర్తుంచుకోని మీ అక్క ఏండ్లనాటి నాబంధుత్వాన్ని కలగానే మరిచిపోయివుంటుందని నాకు తెలుసు...కడసారిగా చూచిపోదామని మొన్న వచ్చాను. కొంచెమయినా కనికరం చూపకపోయింది! కన్నారా నాభార్యనూ, బిడ్డనూ చూస్తే ఆడవాళ్లను కాచుకు తాగుతాడంటుంది లోకం... ఊర్మిల ఎవరో తెలుసా! నాకు—అబ్బ!—అక్రమంగా పుట్టిన బిడ్డ. రత్నదాసు పెంచుకున్నాడు. నా రక్తస్పర్శనుండే నాకు గొడ్డలిపోట్లు ప్రాప్తించినాయి. అది దుర్భరమైంది నాకు—"

వింటూన్న అనిలుడు చెక్కబారిపోయినాడు.

"బావా! నే ఎక్కడికో తెలుసా?"

"విన్నాను అంతా. నాతోనే రా."

✂

కాత్యాయని కిప్పు డరవయ్యేపడి దాటింది. కుంగి కృశించిపోయింది ... ఇప్పటికీ పడమటింట్లో దేవుడి పీటక్రింద రెండు వజ్రాలు ముడికట్టివున్నాయి!! ఒక్కొక్కనాడు దీపారాధనచేసి అంటుంది: "స్వామీ! మాతమ్ముణ్ణి పంపించవూ! గడ్డి తిని చేశాను...యీ రెండు వజ్రాలూ, రాగానే, అతనికి వుంగరాల్లో పొదిగిస్తాను"

ఊర్మిల కిప్పుడు నలుగురు బిడ్డలు. మొదటివాని పేరు అనిలుడు. వేదవతి కొక్కతే కూతురు. మేనత్త పేరు పెట్టారు. కాత్యాయని!